


లెక్కలు తేల్చుకుందామా..

- రాష్ట్రం నుంచి ఇచ్చిన ఆదాయం ఎంత.. కేంద్రం ఇచ్చిన నిధులెన్ని..
- బీఆర్ఎస్‌తో బీజేపీకి చీకటి ఒప్పందం
- రాజకీయ చైతన్యం, పోరాటాలకు వేదిక కరీంనగర్
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని కుట్రలను తిప్పికొట్టండి
- నరేందర్‌రెడ్డిని గెలిపించండి..
- పట్టభద్రుల సంకల్పసభలో సీఎం రేవంత్‌రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'లక్ష కోట్ల నిధులు రాష్ట్రానికి తీసుకువచ్చామని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చెబుతున్నారు.. రాష్ట్రం నుంచి కేంద్రానికి ఎంత ఆదాయం ఇచ్చాము.. కేంద్రం రాష్ట్రానికి ఎన్ని నిధులు ఇచ్చింది.. అనే విషయాల లెక్కలు తేల్చుకుందామా'.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల సంకల్ప సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలో చేయలేదని విమర్శించారు. అయినా ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించమని చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు ఏ అభ్యర్థికి ఓటు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

● నిరుద్యోగ యువతను ఆదుకుంటాం

దేశంలోనే కరీంనగర్‌కు ప్రత్యేక స్థానం ఉంది..రాజకీయ చైతన్యం, పోరాటాల గడ్డ కరీంనగర్ అని అన్నారు. కరీంనగర్ గడ్డ మీద ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సోనియాగాంధీ మిగతా 7వ పేజీలో...



ప్లకార్డులతో నరేందర్ రెడ్డికి మద్దతు తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

సీఎం పర్యటన సాగిందిలా..

- **సాయంత్రం 6:** శాతవాహన విశ్వవిద్యాలయంలో హెలిప్యాడ్‌కు చేరుకున్నారు
- **6:15:** ఎస్సారార్ కళాశాల మైదానంలోని సభావేదికకు చేరకున్నారు.
- **7:06:** ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రారంభించారు.
- **7:52:** ప్రసంగాన్ని ముగించారు. ఆయన 46 నిమిషాల పాటు ప్రసంగించారు.
- **8:00:** హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో తిరుగుప్రయాణం



ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని పరిచయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పాల్గొన్న ప్రజలు

సీఎం, టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం

● భారీ బందోబస్తు మధ్య ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతం



కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పట్టభద్రుల సంకల్ప సభకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు శాతవాహన విశ్వ విద్యాలయం హెలిప్యాడ్ వద్ద కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. సీఎంతోపాటు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు సోమ వారం సాయంత్రం ఆరు గంట లకు హెలిక్యాప్టర్ ద్వారా శాతవాహన విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. వారికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు స్వాగతం పలికారు. అనంతరం సీఎం కాన్వాయ్ ఎస్సారార్ కళాశాల సభవేదికపైకి 6:15కు చేరుకున్నారు. వేదికపైకి రాగానే నేతలు సన్మానించారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన సభ జరిగింది.

● విస్తృతంగా తనిఖీలు



సీఎం పర్యటన నేపథ్యంలో సభ జరిగే మైదానాన్ని ఉదయమే పోలీసులు ఆధీనంలోకి తీసుకుని తనిఖీలు నిర్వహించారు. సభా వేదిక వద్ద మెటల్ డిటెక్టర్లు, బాంబుస్క్వాడ్‌లతో తనిఖీ చేశారు. ఇన్‌చార్జి పోలీస్‌కమిషనర్ అఖిల్ మహాజన్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా వేదిక వద్ద అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆరుగురు ఏసీపీలు, 20 మంది సీఐలు, 40 మంది ఎస్ఐతోపాటు 450 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.

● గంటన్నర ఆలస్యంగా....

సీఎం రేవంత్‌రెడ్డి కరీంనగర్‌లో పట్టభద్రుల సంకల్ప సభకు షెడ్యూల్ ప్రకారం 4:25 గంటలకు రావాల్సి ఉండగా ఆలస్యంగా 6 గంటలకు కరీంనగర్‌కు చేరుకున్నారు. 4:30 గంటలకు సభాస్థలిలో ఖాళీగా ఉండగా సీఎం సభావేదికకు వచ్చేసరికి కుర్చీలు నిండాయి. మంత్రులు, ఇతర నాయకులు ప్రంగిస్తున్న సమయంలో చాలామంది బయటనే నిలుచుండి పోవటంతో సభాధ్యక్షుడు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి జనాలను కూర్చోవాలంటూ మైక్‌లో విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ హెలిక్యాప్టర్‌లో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా సభ ముగిసే సరికి సమయం రాత్రి ఎనిమిది కావడంతో రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు. సీఎం హైదరాబాద్‌కు బయట్దేరి వెళ్లేవరకు పోలీసులు బందోబస్తుతో అప్రమత్తంగా ఉన్నారు.

● జిల్లా మంత్రులకు సీఎం ప్రశంస

జిల్లాకు చెందిన మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత పార్టీ నేతలను ఒప్పించి పార్లమెంట్‌లో తన వాణిని వినిపించి తెలంగాణలో కీలక భూమిక పోషించారన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన ఉపసంఘంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. యువతకు ఉపాధి కల్పన, రాష్ట్రానికి ఐటీ పెట్టుబడులు కల్పించడంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును అభినందించారు. శాతవాహన యూనవర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాల మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

● సైడ్ లైట్స్:

- జై కాంగ్రెస్ అంటూ రెడుసార్లు నినాదాలు చేసిన తరువాత ప్రసంగాన్ని సీఎం ప్రారంభించారు.
- బీజేపీ, బీఆర్ఎస్‌పై విమర్శలు, సవాళ్లు చేసిన సందర్భాల్లో సభికుల నుంచి ఈలలు, చప్పట్లు వచ్చాయి.
- సాయంత్రం 5 గంటల వరకు ఎస్సారార్ మైదానం ఖాళీగా కనిపించింది. సీఎం సభావేదికకు వచ్చేసరికి మైదాపంలె వేసిన కుర్చీలు నిండిపోవటంతో మంత్రులతోపాటు జిల్లా నాయకులు ఊపిరిపీల్చుకున్నారు.
- షెడ్యూల్ ప్రకారం 4:25కు ప్రారంభం కావాల్సిన సభ ఆలస్యం కావటంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రసంగాలను కుదిస్తూ రెండు నిమిషాల్లో ముగించాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు.

ఉత్తర తెలంగాణను మరింత వేగంగా అభివృద్ధి చేస్తాం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కరీంనగర్ టౌన్/ కరీంనగర్ అర్బన్: విద్యావేత్త, మేధావి అయిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, నీటిపారుదలు, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడి కోరారు. పదోన్నతులు, బదిలీలను చేసిన విష యాన్ని ఉపాధ్యాయులు మరిచిపోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు 10 నుంచి 15వ తేదీ వరకు జీతాలు ఇచ్చేదని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో తాము ప్రతినెలా 1వ తేదీకి జీతాలు ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి...ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని ఉత్తర తెలంగాణను మరింత వేగంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో 72 గంటల సమయం మాత్రమే ఉందని, ప్రతి ఒక్క ఓటరు ఇంటికి వెళ్లి వారితో ఓటు వేయించాలని పార్టీశ్రేణులను కోరారు.

హామీలు నెరవేరుస్తున్నాం

- మంత్రి పొన్నం ప్రభాకర్



ఇచ్చిన హామిలన్నింటిని నెరవేరుస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 27న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కారించామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


- మంత్రి సీతక్క



పట్టభద్రులు, ఉద్యోగులు చైతన్య ప్రదర్శించి ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు. బీజేపీ నాయకులు దేవుడిని అడ్డం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. చివరకు దేవుడికి సమర్పించే అగర్‌బత్తిపైనా కేంద్రం జీఎస్టీ విధించిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న విద్యావేత్త నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలన్నారు.

తెలంగాణపై వివక్ష చూపిస్తున్న కేంద్రం

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



కేంద్రం తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపిస్తున్నదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. కృష్ణ, గోదావరి జలాల పంపకాలపై అనేక అంక్షలు పెడుతుందన్నారు. కాజీపేట్ వ్యాగెన్ ఫ్యాక్టరీ పనులు పూర్తవడం అనుమానంగానే ఉందన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం ఇప్పటికీ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధుల్లో కేంద్రం పక్షపాతం చూపిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఒక ప్రజాస్వామిక వాతావరణం ఏర్పడడం తాను మొదటి సారిగా చూస్తున్నానన్నారు. కుల గణన ఎస్సీ వర్గీకరణ చేశారని అన్నారు. గత ప్రభుత్వంలా ఫోన్ ట్యాపింగ్, సమావేశాలపై నిషూలు లేవని అన్నారు. ఓటర్లు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని విద్యావంతులు నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. నాలుగు ఎంపీ స్థానాలు, 42 అసెంబ్లీ నియోజక వర్గ ప్రజల అభిప్రాయాన్ని ఎమ్మెల్సీ స్థానంలోని పట్టభద్రులు వెలిబుచ్చే అవకాశం ఉందని, మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల రోజు

ఉద్యోగులకు సాధారణ సెలవు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజిమెంట్, అథార్టీలలో పనిచేస్తున్న పట్టభద్రులు కూడా వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా యాజమాన్యాలు అనుమతి, వెసులుబాటు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకసాధారణ సెలవు, వెసులుబాట్లను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

● ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎండల తీవ్రత జాగ్రత్త చర్యలపై జిల్ల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలన్నారు. వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి నిమ్మరసం అందించాలన్నారు. విద్యుత్ నిర్వహణ పనులను ఉదయం, సాయంత్రమే చేయాల్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత కారణంగా మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడితే 108కి కాల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మికిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి సబిత పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

ఎలిగేడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ముంజంపల్లి అంజయ్య(73) అనే వృద్ధుడు జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిభార్య కమలమ్మ ఐదేళ్లనుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఏడాదిగా అంజయ్య కూడా అనారోగ్యానికి గురయ్యాడు. ఇద్దరికీ ఆసుపత్రులకు అధిక ఖర్చులు కావడం, కొడుకును ఇబ్బంది పెడుతున్నామని బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపంతో సోమవారం ఉదయం ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

ఇద్దరికి ఐదేళ్ల జైలు

సిరిసిల్లక్రైం, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమరవాణా కేసులో వడిచెర్ల జాన్‌ప్రతాప్‌రెడ్డి, గమ్మడివెళ్లి చంద్రశేఖర్‌లకు ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.50వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధానన్యాయమూర్తి ఎన్ ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. తూర్పుగోదావరిజిల్లాకుచెందిన గుమ్మడివెళ్లి చంద్రశేఖర్, నాంపల్లికిచెందిన జాన్ ప్రతాప్‌రెడ్డి జూన్8, 2020న నాంపల్లి ప్రాంతంలో గంజాయిరవాణా చేస్తున్నారన్న సమాచారంమేరకు వేములవాడ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వారివద్ద 3.5కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరిద్దరిపై అప్పటి సీఐవెంకటేశ్ కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు మానిటరింగ్ అధికారి రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్, నవీన్‌లు ఎనమిది మంది సాక్షులను ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు అయిదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.50వేల జరిమానా విధించారనితెలిపారు. నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన ఏపీపీని, సీఐ, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

నాసిరకంగా..

డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

నిబంధనలు పట్టించుకోని కాంట్రాక్టర్

పనులను పర్యవేక్షించని అధికారులు



వడుకాపూర్ గ్రామం వద్ద రోడ్డు పనులు

జూలపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి శివారు నుంచి చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంకట్రావుపల్లి నుంచి కాచాపూర్, వడుకాపూర్, జూలపల్లి మండల కేంద్రం వరకు ఉన్న శిథిలావస్థకు చేరు కుంది. రోడ్డు మార్గం గుంతలుగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి సరిగా లేక ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడగా ఎందరో గాయాలపాలయ్యారు. రహదారి విస్తరించాలని మండల ప్రజలు, పార్టీల నాయకులు ఆందోళనలు చేపట్టారు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు తీరుతాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేసినప్పటికి, నాసిరకం పనులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి శివారు ప్రాంతం నుంచి కాచాపూర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం కాచాపూర్ నుంచి మండల కేంద్రం వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో నిబంధనలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల్లో చెట్ల మొదళ్లను తొలగించకుండా వాటిపైనే మట్టి పోసి నిర్మాణం చేపడుతుండడంతో కాంట్రాక్టర్ పనితీరుపై మండి పడుతున్నారు. ఎర్ర మొరం ఉపయోగించాల్సి ఉండగా కాంట్రాక్టర్ మట్టిపోస్తున్నాడని పేర్కొంటున్నారు. పనులు నాసిరకంగా జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.మట్టిపై నీళ్లు పోయకపోవడంతో దుమ్ము లేస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాచాపూర్ నుంచి జూలపల్లి వరకు 19కోట్ల 80 లక్షల రూపాయలతో చేపట్టారు. నాసిరకం పనులపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వాన్నంగా డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు

జవ్వాజి చంద్రమౌళి,
సామాజిక కార్యకర్త, జూలపల్లి



డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా. పనులను పర్యవేక్షించాల్సిన అధికారుల పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిన చేస్తు న్నాడు. మట్టిపోసి నీరు చల్లడం, రోలింగ్ చేయడం లేదు. ఉన్నతాధికా రులు దృష్టిసారించి పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలి.

రోడ్డుపనుల్లో ఏమాత్రం నాణ్యత లేదు

వేల్పుల ఓదెలు, బీజేపీ నాయకుడు, వడుకాపూర్



రోడ్డు పనుల్లో నాణ్యత లోపించింది. చెట్ల మొదళ్లను తొలగించ కుండా వాటిపై మట్టిపోస్తున్నారు. ఫీటున్నర లోతుగా మట్టిని తొలగించి ఎర్ర మట్టి నింపి రోలింగ్ చేయాల్సి ఉండగా అలా చేయడం లేదు. విద్యుత్ స్తంభాలను తొలగించడంలేదు, అధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి పనుల నాణ్యతను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.



రోడ్డు పనుల్లో నాసిరకం తెల్ల మట్టి, రోడ్డు పక్కన చెట్ల మొదళ్లపైపోసిన మట్టి, గ్రామ శివారులో రోడ్డుపై పోసిన నల్లమట్టి

కారు ఢీకొని యువకుడు దుర్మరణం

చొప్పదండి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలో గుర్తు తెలియని కారు ఢీకొని ఓ యువకుడు మరణించాడు. ఎస్సై అనూష కథనం ప్రకారం.. మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన ఒడ్నాల రమేశ్(28) చొప్పదండిలోని ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఉడిపి హోటల్ ఎదురుగా గుర్తుతెలియని కారు అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. రమేశ్ బాబాయి ఇరుకుల్ల శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూష తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న పికప్ వాహనం

● ఒకరు మృతి



గంగారాం (ఫైల్)

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్-మోతె బైపాస్‌రోడ్డులో సోమవారం ఉదయం ఓ వాహనం బైక్‌ను ఢీకొనడంతో జగిత్యాలరూరల్ మండలం వంజరిపల్లి గ్రామానికిచెందిన అత్తెన గంగారాం (49) మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఆయన కథనంప్రకారం.. అత్తెన గంగారాం ఉదయం తనపొలం వద్దకు బైక్‌పై వెళ్తుండగా బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా మృతిచెందాడు. గంగారాం భార్య పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్లపట్టణంలోని వెంకంపేటకు చెందిన గుర్రం పవన్ అనే యువకుడిని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులువెళ్లి తనిఖీ చేయగా అతని వద్ద 50గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

భారీ వాహనం బోల్తా

● ధ్వంసమైన విద్యుత్ సామగ్రి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని అయిలాపూర్ రోడ్డు రైల్వే వంతెనపై సోమవారం భారీ వాహనం బోల్తా కొట్టింది. మహారాష్ట్ర నుంచి రామగుం డంలోని విద్యుత్ కర్మాగారానికి పరికరాలు తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో వాహనంలో ఉన్న విద్యుత్ సామగ్రి వంతెన పక్కకు పడిపోయి ధ్వంసం అయ్యాయి. వాహనం డీజిల్‌ట్యాంక్ పగిలిరోడ్డుపై ప్రవహించగా అదృష్ట వశాత్తు అగ్నిప్రమాదం జరగలేదు. స్థానికులు డ్రైవర్ షోహేల్‌పాషాకు స్వల్పగాయాలు కాగా బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ




సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపించిన తర్వాత రాష్ట్రంలోని నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని, సేవేలక్ష్యంగా పనిచేస్తానని పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి పులి ప్రసన్నహరికృష్ణ అన్నారు. సోమవారం సుల్తానాబాద్‌లో పట్టభద్రులు బీసీ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వ్యక్తులకు కామన్ మ్యాన్‌కు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నెలకొందని, పట్టభద్రులు ఆలోచించి తమనిర్ణయాన్ని తీసుకోవాలన్నారు. ఏనాడు ప్రజలకు ముఖం చూపించని నేతలు ఎన్నికల్లో ఉంటూ కోట్లు ఖర్చు పెడుతున్నారని, వీరి గెలుపునకు పెద్దపెద్ద నేతలు హెలికాప్టర్లు పట్టుకొని తిరుగుతున్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఏమి చేస్తానో హరికృష్ణ వివరించారు. ఈ సందర్భంగా పలు బీసీ సంఘాలు హరికృష్ణను సన్మానించాయి. రాష్ట్ర బీసీసంఘాల నాయకులు పడాల అజయ్‌గౌడ్, విట్టల్, కీర్తి లతాగౌడ్, కోట రవీందర్, మహిపాల్ యాదవ్, బోయిన్ రంజిత్, ములుగురు అంజయ్య గౌడ్, గట్టు శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

● పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు



భ్రమరాంబ, మల్లికార్జునులకు మాంగల్య ధారణ నిర్వహిస్తున్న అర్చకులు


ఓదెల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లికార్జునస్వామి కల్యాణాన్ని సోమవారం పురోహితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణాల మధ్య మధ్యాహ్నం 1.19 గంటలకు కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు దంపతులు పట్టు వస్త్రాలను, తలంబ్రాలను సమర్పించారు. ఉదయం 10.30 నుంచి ప్రారంభమైన కల్యాణోత్సవ వేడుకలు, వేదపండితులు మధ్యాహ్నంవరకు కొనసాగించారు. అర్చకుల మంత్రోచ్చారణలతో మధ్య, మేళతాళాలతో ఉత్సవవిగ్రహాలను వేదికకుతీసుకువచ్చి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అక్షింతలు సమర్పించి ఆశీర్వచనాన్ని పొందారు. మంచిర్యాలకు చెందిన భక్తుడు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈఓ సదయ్య, వేదపండితులు డా.మహంతయ్య, భువనేశ్వరశాస్త్రి, జ్ఞానే శ్వర శాస్త్రి, శివశంకరశాస్త్రి, ప్రత్యగాత్మ, అర్చకులు ధూపం మఠం వీర భద్రయ్య, భవాని ప్రసాద్, పంచాక్షరయ్య, గంగాధర స్వామి తోపాటు కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ మాజీ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా సైగలుచేస్తూ వేధించినకేసులో ఒడ్డేటి చంద్రతేజ(30) అనేవ్యక్తికి 20రోజుల జైలుశిక్షతోపాటు రూ.26వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన కేసులో ధర్మపురికిచెందిన ఒడ్డేటి చంద్రతేజ 2021 సంవత్సరంలో పాఠశాలకు వెళ్తున్న బాలికల పట్ల తరచుగా సైగలు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత బాలిక జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులు తెలియజేయగా వారు రూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు డ్యూటి అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కేసువాదించారు. నేరంరుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ముస్తాబైన రాజన్న ఆలయం

● నేటి నుంచి మహా శివరాత్రి జాతర ● బందోబస్తుకు 1500 మంది పోలీసులు ● రూ.300లతో బ్రేక్ దర్శనాలు



విద్యుత్ కాంతుల్లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల/ వేములవాడ కల్చరల్)

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలకు సర్వంసిద్ధం చేశారు. మంగళవారం నుంచి గురువారం వరకు మూడురోజుల పాటు జరిగే మహాశివరాత్రి జాతరకు అధికారులు సర్వం సిద్ధంచేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, జిల్లాకలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, దేవస్థానం ఈవోవినోద్‌రెడ్డి, నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సౌకర్యాల కల్పనకు రూ 2.03 కోట్ల వరకు ఖర్చు చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు.

● నేడు స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ

జాతరలో భాగంగా బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి 7గంటలకు ప్రభుత్వం తరపున రాష్ట్రరవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి7.30గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ చేసి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు నిశిపూజ అనంతరం భక్తులకు స్వామివారి లఘు దర్శనం, కోడె మొక్కులు కొనసాగిస్తారు. 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లఘు దర్శనాలు, కోడెమొక్కులు నిరంతరాయంగా కొనసాగుతాయి. మంగళవారం రాత్రి 11గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 1.30గంటల వరకు స్థానికులకు సర్వదర్శనం, 1.30గంల నుంచి 2.30గంటల వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30గంటల నుంచి 3.40వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు, 3.40నుంచి 4.23 వరకు సుప్రభాతం, ఉదయం 4.30 గంటల నుంచి 6గంటల వరకు ప్రాతః కాలపూజ, అర్చకుల దర్శనం, అనంతరం నిరంతరంగా దర్శనాలు, సాయంత్రం 6.08 నిముషాల నుంచి స్వామివారి కళ్యాణ మండపంలో మహాలింగార్చన, రాత్రి11.30నిముషాలకు లింగోద్భవ కాలమందు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. గురువారం సుప్రభాతంతో భక్తుల మొక్కుబడులు, ఆర్జితసేవలు ప్రారంభం అవుతాయి.

● జాతరకు 4లక్షల మంది భక్తులు..

భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. జాగరణకు వచ్చే భక్తులు 4లక్షల వరకు ఉంటారని అంచనాలు వేసి ఏర్పాట్లుచేశారు. రూ.300లతో బ్రేక్ దర్శన సౌకర్యాన్ని కొనసాగిస్తున్నారు. దేవస్థానం వద్ద వీఐపీ పార్కింగ్, గుడిచెరువు వద్ద 9సెక్టార్‌లు, గ్యాస్ గోడౌన్‌వద్ద కొండగట్టు రూట్ జంక్షన్, మార్కెట్ యార్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎల్లమ్మ టెంపుల్ వద్ద పార్కింగ్‌స్థలాలు సిద్ధం చేశారు. 9చోట్ల ఆరోగ్య శిబిరాలను సిద్ధం చేశారు. మరో 7చోట్ల మైహెల్ప్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా 27చోట్ల చలివేంద్రాలు,6చోట్ల రాజన్న జలప్రసాదాలు, భక్తుల క్యూలైన్లలో 90వేల మజ్జిగ ప్యాకెట్లు, శుద్ధజల క్యాన్‌లు, 27ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ధర్మగుండంలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టారు. 137 తాత్కాలిక స్నానపు గదులు, 60 చోట్ల తాత్కలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

● 850 ఆర్టీసీ బస్సులు..

వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు భక్తులు చేరుకునే విధంగా ఆర్టీసీ హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హనుమకొండ, కామారెడ్డి, సిద్ధిపేట, మెదక్, నిజామాబాద్, జగిత్యాల, మహబూబ్‌నగర్, నర్సంపేట, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిర్మల్, సిరిసిల్ల, మంచిర్యాల, అదిలాబాద్, తదితర ప్రాంతాల నుంచి మూడు రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. జాతర కోసం 850 బస్సులు నడిపించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులను దేవస్థానం వద్దకు చేర్చడానికి 14 ఉచిత మినీ బస్సులను దేవస్థానం ఏర్పాటు చేసింది.

● మహాప్రసాదం సిద్ధం

భక్తులు కోడె మొక్కుతోపాటు స్వామి వారి మహాప్రసాదానికి ప్రాధ్యానం ఇస్తారు. నెయ్యి, పంచదార. శనగపప్పు, కిస్‌మిస్, కాజు, యాలకులు, తదితర సుగంధ ద్రవ్యాలతో నాణ్యమైన నాణ్యతతో లడ్డు తయారీ చేపట్టారు. మహాశివరాత్రి దర్శనానికి వచ్చే భక్తులకు వంద గ్రాముల లడ్డు రూ.20, ఐదువందల గ్రాముల అభిషేకం లడ్డు రూ.100కు అందిస్తారు. 250గ్రాముల పులిహోర రూ.15కు విక్ర యిస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మూడు కేంద్రాల్లో వివిధ కౌంటర్ల ద్వారా భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని అందించనున్నారు.



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది

తండ్రి జాడకోసం వెళ్లిన కొడుకు..

రోడ్డు ప్రమాదంలో మృతి



నిషాంత్ (ఫైల్)

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన తండ్రి మూడు రోజుల నుంచి ఇంటికి రాలేదు. తండ్రికోసం వెతుకుతున్న కొడుక్కి అతడు బద్దెనపల్లిలో తాగి పడిపోయాడని తెలిసింది. వెంటనే అతడు స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరగా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికిచెందిన జంగ భూమయ్య-రేణుకలకు ఒక్కగానొక్క కుమారుడు జంగ నిషాంత్(17). గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతిచదువుతున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌పనితోపాటు కూలీ పనులు చేస్తున్న తండ్రి భూమయ్య మద్యానికి బానిసయ్యాడు. మూడురోజుల క్రితం ఇంట్లోనుంచి వెళ్లిన భూమయ్య ఇంటికి రాలేదు. సెల్‌ఫోన్‌ను సైతం స్విచ్‌ఆఫ్‌లో ఉంచాడు. అతనికోసం వెతుకుతున్న క్రమంలో ఆదివారం రాత్రి మండలంలోని రామన్నపల్లె గ్రామంలో అత్తావారింటి వద్దనే తాగిపడిపోయి ఉన్నాడని బంధువులు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తండ్రిని తీసుకు వచ్చేందుకు క్లాస్‌మెట్ అయిన బన్నితో కలిసి ద్విచక్ర వాహనంపై ఉదయం వెళ్తుండగా సారం పల్లి బస్టాండ్ వద్ద బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న నిషాంత్ అక్కడిక్కడే మృతి చెందగా బన్నికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తండ్రి భూమయ్య తోపాటు బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహంపై పడి రోధించారు. మృతుడి తల్లిదండ్రులు భూమయ్య, రేణుక ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడిపై

పోక్సో కేసు

కోనరావుపేట, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లె నిజామాబాద్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కనపర్తి బ్రహ్మంపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్అక్క ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలలో విద్యార్థినులకు షీటీం పోలీసులు అవగాహన కల్పిస్తుండగా కనపర్తి బ్రహ్మం అనే ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు కొంతమంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



కరీంనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

భగత్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాబోయే 2028అసెంబ్లీ ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి అవుతాడని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. కరీంనగర్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 'బీసీ కులబాంధవుల రాజకీయ సమాలోచన, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల పాత్ర' అనే అంశంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు బీసీ మీటింగ్ పెడితే డబ్బులు ఇచ్చేవారని, ఇప్పుడు బీసీ మీటింగ్ అంటేనే భయపడుతున్నారని అన్నారు. తెలంగాణలో గాడిదలు, కుక్కలను లెక్కలు కడుతున్నారని, బీసీలను మాత్రం లెక్కించడం లేదన్నారు. సింహమైనా, పులైనా బీసీల ముందు తలవంచాల్సిందేనని అన్నారు. రాబోయే రోజుల్లో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయని, అందులో నాలుగు సీట్లు బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు విష యంలో ఒకరోజు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి ఫోన్‌చేస్తే ఒక్క పైసా తగ్గించలేదన్నారు. అదే మల్కా కొమురయ్యకు ఒకవిద్యార్థి ఫీజు విషయంలో ఫోన్‌చేస్తే రూ.70వేలు తక్కువచేశారని, అదే మన బీసీలకు ఉన్న భారీ గుణమన్నారు. స్థానిక ఎన్నికల్లోగా ఉమ్మడికరీంనగర్ జిల్లాలో బీసీ రాజకీయ శిక్షణతరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి వచ్చిన బీఎస్పీఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు ఉపాధ్యాయులు, న్యాయవాదులను కలిస్తే మీరు, మేముబీసీ టైంవేస్ట్ చేయకుండా వేరేవాళ్లను కలవండని అంటున్నారన్నారు. బీసీవాదం పేపర్‌లకే పరిమితం కాకుండా ఓటింగ్‌లో చూపించాలన్నారు. పట్టభద్రుల స్థానంలో తనను, ఉపాధ్యాయులస్థానంలో మల్కా కొమురయ్యను పెద్దలసభకు పంపాలని కోరారు. బలరామకృష్ణులుగా శాసనమండలిలోపోరాటం చేస్తామన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

జగిత్యాలక్రైం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో సోమవారం తెల్లవారుజామున గుండేటి రాజశేఖర్ అనేవ్యక్తి ఇంట్లో దొంగలు పడి 8తులాల బంగారం, రూ.18వేల నగదును ఎత్తుకెళ్లారు. రాజశేఖర్ కుటుంబంతో కలిసి రెండో అంతస్తులో నిద్రిస్తుండగా కింది అంతస్తులో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు పేర్కొన్నారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన జంగిలి శ్రీనివాస్(52) అనేవ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పేర్కొ న్నారు. 100గజాల స్థలంవిషయంలో శ్రీనివాస్‌ను చెల్లెళ్ల కర్రలతో కొట్టి ఆది వారం హత్యచేశారు. పోలీసులు సోమవారం నిందితులు భారతపు వరలక్ష్మి, వొడ్నాల శారదను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్య మైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. తిప్పాపూర్ మూలవాగు బ్రిడ్జికింద 35నుంచి40ఏళ్లవ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు సమాచారం అందించారన్నారు. మృతుడి వివరాలుతెలిసిన వారు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

లెక్కలు తేల్చుకుందామా..

- రాష్ట్రం నుంచి ఇచ్చిన ఆదాయం ఎంత.. కేంద్రం ఇచ్చిన నిధులెన్ని..
- బీఆర్‌ఎస్‌తో బీజేపీకి చీకటి ఒప్పందం
- రాజకీయ చైతన్యం, పోరాటాలకు వేదిక కరీంనగర్
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని కుట్రలను తిప్పికొట్టండి
- నరేందర్‌రెడ్డిని గెలిపించండి..
- పట్టభద్రుల సంకల్పసభలో సీఎం రేవంత్‌రెడ్డి


సభకు హాజరైన ప్రజలు



(5వ పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారన్నారు. మాటకు కట్టుబడి నాలుగు కోట్ల ప్రజల అకాంక్షకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆర్థిక సంక్షోభం లో కొట్టుమిట్టాడిన దేశాన్ని నిలబెట్టిన ఘనత కరీంనగర్ ముద్దుబిడ్డ పీవీ నర్సింహారావుదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 56,315 ఉద్యో గులు కల్పించామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ టెట్, డీఎస్సీ నిర్వహించలేదని, ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెలా 20వ తేదీ వరకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించి వారి ఆత్మగౌరవం దెబ్బతీసిందన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని తెలిపారు. ఇది నిజమైతేనే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఐటీఐల అప్‌గ్రేడ్

1956లో ఏర్పాటుచేసిన ఐటీఐల్లో చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లకు విలువ లేకుండా పోయిందని, వారు నేర్చుకున్నది, చదివింది ఒకటైతే సంబంధంలేని ఉద్యోగం చేస్తూ ఇబ్బందులు పడ్డారని అన్నారు. 65 ఐటీఐలను అప్ గ్రేడ్ చేస్తూ ఏటీసీలుగా మార్చి సాంకేతికవిద్యలో పోటీపడే విధంగా నైపుణ్యం పెంచేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో లక్షా 10 వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు నాణ్యమైన విద్యవారికి అందక పోవడంతో పోటీ పడలేక పోతున్నారని, వారిలో నైపుణ్యం పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని స్థాపిం చామని తెలిపారు. 2014లో లక్ష రూపాయల రైతు రుణాలను మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ అప్పులు మాఫీ చేయక పోవడంతో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. 2018లోనూ అదే హామీ ఇచ్చి రెండోసారి అధికారంలోకి వచ్చారని, దశలవారీగా 11వేల కోట్ల రూపాయలను మాత్రమే రైతురుణ మాఫీ చేస్తే అందులో ఎనిమిది వేల కోట్లు వారి వడ్డీలకే సరిపోయాయని తెలిపారు. ఏడాది లోనే దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా 21వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌పార్టీదేనన్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి

వరి వేసుకుంటే ఉరి అని కేసీఆర్ చెప్పారని, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు రాకున్నా దేశంలోనే అత్యధికంగా 156 లక్షల మెట్రిక్ టన్నులు పండించామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేశామని, సన్న వరికి బోనస్ చెల్లించామన్నారు. బీఆర్‌ఎస్‌పాలనలో తాలు, తప్ప పేరుతో క్వింటాల్‌కు 10 కిలోల తరుగు తీశారని, వారి తీసిన సొమ్ము కూడా రైతుబంధు ద్వారా ఇవ్వలేదని, తాము ఒక్క రూపాయి తరుగు తీసుకోకుండా రైతు బంధు ఇచ్చామన్నారు. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మూడేళ్ళలో కూలడం విచిత్రంగా ఉందని అన్నారు. పొన్నం ప్రభాకర్‌ను ఎంపీగా ఈ ప్రాంతం నుంచి గెలిపిస్తే సొంత పార్టీతోనే పోరాడి తెలంగాణ తెచ్చిండన్నారు.

రెండు సార్లు ఎంపీగా, ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ ఏమి చేశారని ప్రశ్నించారు. బీసీ ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు బీసీ లెక్క తేల్చలేదని, దేశంలో ఏ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి కూడా ఇప్పటి వరకు చేయని విధంగా రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు తాము ఏడాదిలోనే బీసీ కులగణన చేసి 56.33శాతం బీసీలున్న లెక్క తేల్చామని అన్నారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు ఆదేశానుసారం తెలంగాణలో పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా చేసే ప్రయత్నం చేస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారన్నారు.


సభకు తరలివస్తున్న పట్టభద్రులు

సమస్యలన్నింటిని పరిష్కరిస్తా..

పేదలకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సిలిండర్, పది లక్షల ఆరోగ్య శ్రీ, రైతులకు 500 బోనస్ అందిస్తున్నామన్నానని అన్నారు. రాష్ట్రం నుంచి రూపాయి కేంద్రానికి జీఎస్టీ రూపంలో చెల్లిస్తే కేంద్రం మనకు ఇచ్చేది 42 పైసలు మాత్రమేనని తెలిపారు. అదే బీజేపీ పాలిత బీహార్ రూపాయి కేంద్రానికి పంపితే 7 రూపాయలు, ఉత్తర ప్రదేశ్‌కు రూపాయికి 3 రూపాయలు ఇస్తుందని వివరించారు. తెలంగాణాకు కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఆలోచన చేయాలని, మేధావులు, పట్టభద్రులు విచక్షణతో ఆలోచించి, ఓటు వేయాలని కోరారు. ఒక ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలిస్తే ఒరిగేదేమి లేదని, ఈ ఎన్ని కల్లో బీజేపీని బొందపెట్టండి... నిధులు తెస్తామని రేవంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి ఆయనకు అండగా ఉండి పట్టభద్రుల సమస్యలన్నింటిని పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరామ్, టి.జీవన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమణారావు, మక్కాన్ సింగ్, మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, భానుప్రసాద్‌రావు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో ఇప్పటికే 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, భవిష్యత్తులో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే రోజుల్లో 13 నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు కల్పించే బాధ్య త తామే తీసుకుంటామన్నారు. అందరికి వారధిగా ఉండే నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రతిష్ఠాత్మకమైన ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఆరు ఎంపీ స్థానాలు, 42 శాసన సభా స్థానాల్లో 40 శాతం ఓటర్లు ఉండే ఎన్నికలో పట్టభద్రులు, మేధావులు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు.

ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి రేవంత్‌రెడ్డి చేశారు
ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

నలభై సంవత్సరాల కాలంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధిని సంవత్సర కాలంలోనే రేవంత్‌రెడ్డి చేసి చూపించారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. రేవంత్ రాకతో కరీంనగర్ గడ్డ పులకించి పోయిందన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత రేవంత్‌రెడ్డి దేనన్నారు. పట్టభద్రుల, ఉద్యోగుల, అడ్వకేట్ల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటన్నింటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి ఇంటిలో తన విద్యార్థి ఉన్నారని, తనపై అభిమానం చూపించి ఆదరించాలని కోరారు.

ఖాళీలన్నింటిని భర్తీచేస్తాం
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

కరీంనగర్ టౌన్/అర్బన్: 'కాంగ్రెస్ పార్టీ చేతల పార్టీ. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుంది... రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలను నిలబెట్టుకుంటున్నాం. పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి గెలిపించండి... ఖాళీలన్నిటిని భర్తీ చేసి పట్టభద్రులకు అండగా నిలుస్తామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం కరీంనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎస్సారార్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సంకల్ప సభలో ఆయన ప్రసంగించారు. స్వరాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పట్టభద్రులకు ఉద్యోగాలు ఇవ్వలేదు కానీ ఆయన ఇంట్లోని వారికి మాత్రం ఉద్యోగాలిచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే 54 వేల పైచిలుకు ఉద్యోగ ఖాళీలను భర్తీచేసిందని, ఉద్యోగాలివ్వడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేయాలన్నా, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నా, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలన్న అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టి 56 శాతం బీసీలున్నట్లు గుర్తించి, అసెంబ్లీలో 42శాతం బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని అన్నారు. బీసీ కుల గణన చేపట్టిన ఘనత కాంగ్రెస్‌పార్టీకి, రేవంత్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. బీసీ నాయకుడు బండి సంజయ్‌ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే ఏ ఒక్కరూ అడుగలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 35 ఏళ్లలో 15 మందికి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టిందని, బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన ఘనత కాంగ్రెస్ దేనని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఆత్మగౌరవం కల్పించిన కాంగ్రెస్‌పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలని, ఆయన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు తామంతా ఉన్నామని, అన్ని వర్గాలకు మేలు చేసే కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. ఫాంహౌస్‌కు పరిమితమైన 10 ఏళ్ల బీఆర్‌ఎస్ మాటలను నమ్మొద్దన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమి తీసుకురాని కేంద్ర మంత్రులను, బీజేపీ ఎంపీలను నిలదీయాలని పట్టభద్రులకు ఆయన పిలుపునిచ్చారు.



వేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రచారం మంగళవారంతో ముగియనుందని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్ సందర్భంగా 48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్ ఉంటుం దని, ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలవుతుందని పేర్కొన్నారు. ఎస్ఎంఎస్‌లు బల్క్‌గా పంపిం చడం నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహిం చడం పూర్తిగా నిషేధ మని పేర్కొన్నారు. ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌లో విస్తృతంగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ఒపినియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని తెలిపారు. ఎన్నికల ముగిసే వరకు ఆయా జిల్లాల్లోని 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం


ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మహా శివరాత్రి జాతరను పురస్కరించుకుని భక్తులు రాజన్న ఆలయానికి సోమవారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎక్కడ ఇబ్బందులు తలేత్తకుండా ఆలయాధికారులు క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఉదయాన్నే భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించి రాజన్నను దర్శించుకుని కోడెమొక్కులు చెల్లించుకు న్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని రాజన్నను దర్శించుకుని తరించారు.


దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

యాభై యేళ్లుగా అద్దె భవనంలోనే గ్రంథాలయం

ఇబ్బందులు పడుతున్న అభ్యాసకులు

ఓదెల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రంథాలయం ఐదు దశాబ్దాలుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. విద్యార్థులకు, యువకులకు విజ్ఞానాన్ని పెంచేందుకు 1970లో ఇక్కడ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 55 ఏళ్ల నుంచి అద్దె భవనాల్లోనే గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ నియోజకవర్గంలో నాటి నుంచి నేటి వరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పాలన కొనసాగించారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు సొంత భవనాలు, స్థలాలు మంజూరైనప్పటికీ, అద్దె భవనంలో ఉన్న ఓదెల గ్రంథాలయానికి కేటాయించలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు, పెద్దపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడినా గ్రంథాలయాలకు సొంత భవ నం ఏర్పాటుకు ప్రాధాన్యం చూపడం లేదు. గ్రంథాలయానికి రోజు విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో వస్తుంటారు. ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో, కూర్చోడానికి కుర్చీలు కూడా లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఓదెలలో ప్రభుత్వ స్థలం ఉన్నా గ్రంథాలయానికి సొంత భవనం మంజూరు కావడం లేదు. గ్రంథాలయ భవనం నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు యువకులు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదు. గ్రంథాలయానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని కోరుతున్నారు.


అద్దె భవనంలో ఉన్న గ్రంథాలయం

భవనం నిర్మించాలి: కృష్ణ, ఓదెల



విజ్ఞానం పెంచుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ముఖ్యం. ఓదెలలో ఏళ్ళుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి స్థలం, భవనం మంజూరు చేయాలి.

సొంత భవనం ఉంటే సౌకర్యంగా ఉంటుంది

క్యాతం వెంకటేశ్వర్లు, ఓదెల



గ్రంథాలయంలో మరుగుదొడ్డి సౌకర్యం లేని అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. సొంత స్థలం, భవనం ఉంటే అభ్యాసకులందరికీ స్వేచ్ఛగా ఉంటుంది. గ్రంథాలయానికి సొంత భవన నిర్మాణానికి అధికారులు, నాయకులు కృషి చేయాలి.

విదేశాలకు పంపిస్తానని మోసం..

ఏజెంట్ అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పోలాండ్ దేశం పంపిస్తానని మోసం చేసిన ఏజెంట్‌ను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం సిరిసిల్ల పట్టణం గాంధీ నగర్‌కు చెందిన చిలుక శ్రీధర్ వద్ద నుంచి కామారెడ్డి జిల్లా రామారెడ్డికి చెందిన సాయగౌడ్ అనే వ్యక్తి విదేశాలకు పంపిస్తానని 60వేల రూపా యలు తీసుకుని విదేశానికి పంపకుండా సంవత్సర కాలం గడిపాడు. తిరిగి డబ్బులు అడిగితే ఇవ్వలేదు. మోసపోయానని తెలుసుకున్న చిలుక శ్రీధర్ ఏజెంట్ సాయి గౌడ్‌పై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. విచారణ చేపట్టిన పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు ఏజెంట్ తుపా కుల సాయిగౌడ్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గుర్తు తెలియని ఏజెంట్లను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని విదేశాలకు వెళ్లానుకునేవారు లైసెన్సు గల ఏజెంట్లను సంప్రదించాలని, ఎవరైనా గల్ఫ్ బాధితులు ఉంటే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అవీఇవీ

గణేశ్‌నగర్: మరమ్మతుల్లో భాగంగా మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టూ ఏడీఈ లావణ్య తెలిపారు. ఉదయం 10:30 నుంచి 11:30 వరకు కట్ట రాంపూర్ మెయిన్‌రోడ్, వినాయకనగర్, శ్రీనివాస్ నగర్, ప్రొఫెసర్ జయశంకర్ నగర్, గిద్ద పెరమండ్ల గుడి, మహాలక్ష్మి నగర్, తిరుమల నగర్‌లో, ఉదయం 10 గంటల నుంచి 11 వరకు రాంనగర్, రాజీవ్‌చౌక్, లేబర్ అడ్డా, మంకమ్మతోట, దంగన్వాడి స్కూల్, సత్య లాడ్జి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంలో కొబ్బరి ముక్కల పోగు, కొబ్బరికాయల అమ్మకం హక్కుల కోసం మార్చి 3న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈవో ఎండపెల్లి మారుతి ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఫారాలు లభిస్తాయని పేర్కొన్నారు.

సుభాష్‌నగర్: వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు రాచకొండ రూపశ్రీ, ప్రధానకార్యదర్శి ఒజ్జల రాజమణి, కోశాధికారి గంప హరిణి పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని జి.పుష్పలతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మాలతి సోమవారం అభినందించారు. బెంగుళూరులో 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో ఎస్‌యూ తరఫున జాతీయ సేవా పథకం వలంటీర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: కాంట్రాక్ట్ అధ్యాపకులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గతేడాది నవంబరు 19న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మిగిలిన 460 మంది సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌సీ కేసు వేశారు. రెగ్యులరైన జూనియర్ డిగ్రీ పాలిటెక్నిక్ అధ్యాపకులు గతంలో కెవిట్ కేసు వేశారు. సోమవారం సుప్రీం కోర్టులో మొదటిసారిగా వాదనలు జరిగాయి. వాదనలు విన్న జస్టిస్ విక్రమ్నాథ్ జస్టిస్ సందీప్ మీతాతో కూడిన ధర్మాసనం నాలుగువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

భగత్‌నగర్: కరీంనగర్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజి ఆధ్వర్యంలో సోమవారం ఫిలాటెలీ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ తహేర్‌జీ (ఫిలాటెలిస్ట్) స్థానిక లెజెంట్ స్కూల్ విద్యార్థులకు ఫిలాటెలీ, అకౌంట్స్, స్టాంప్స్ సేకరణపై వివరించారు.

సుభాష్‌నగర్: తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(టీజీవో) అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, టీజీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సత్యనారాయణ సోమవారం జిల్లా కేంద్రానికి రాగా ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన సీఎం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలోని మానకొండూర్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని సోమవారం రాత్రి సందర్శించారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించిన పట్టభద్రుల సంకల్ప సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి హైదారాబాద్ తిరుగుప్రయాణంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆహ్వానం మేరకు క్యాంపు కార్యాలయానికి వచ్చారు. సీఎంతోపాటు మంత్రులు కలిసి భోజనం చేశారు. రాత్రి 8.30 నుంచి 9.15 గంటల వరకు క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి వారితో మాట్లాడారు. అనంతరం హైదారాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, మాజీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పురమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్ రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న సీఎం

బస్సు చార్జీల పెంపు రద్దు చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హిందూ పండుగలకు దేవాలయాలకు నడిపించే బస్సు చార్జీల పెంపును రద్దు చేయాలని హిందూ జన జాగృతి సమితి సభ్యుడు సత్యనారాయణచారి కోరారు. సోమవారం కరీంనగర్‌లో ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో 50శాతం చార్జీలు పెంచడం సరికాదన్నారు. ఇతర మతాలవారికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాయితీలు ప్రకటిస్తున్నాయని, అదే హిందువులు దేవాలయాలకు వెళ్లాలంటే అధిక భారం మోపుతున్నాయని అన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అడ్మిషన్ల ప్రక్రియ ప్రచారంలో భాగంగా చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపక బృందం సోమవారం ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్య కేవలం ప్రభుత్వ కళాశాలల్లోనే దొరుకుతుందన్నారు. డాక్టర్ సత్యప్రకాష్, డాక్టర్ మల్లారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రావర్తి శ్రీనివాస్, డాక్టర్ రాజేశం పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

బీసీల గెలుపుతోనే సామాజిక తెలంగాణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలని, బీసీల గెలుపుతోనే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని సామాజికవేత్త, ఉద్యమకారుడు విఠల్, బీసీ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కన్వీనర్ కొత్త లక్ష్మణ్, నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మహిపాల్ యదవ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల జనాబా 60శాతం ఉన్నా రాజకీయంగా న్యాయం లభించడం లేదన్నారు. బీసీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు. బీసీ బిడ్డ ప్రసన్న హరికృష్ణ ఎంతో మందికి ఉచితంగా విద్యను అందించినట్లు చెప్పారు. రూ.10వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను కేవలం ఒక్క రూపాయికే 5 లక్షల మందికి అందించారన్నారు. ఉద్యోగంలో చేరిననాటి నుంచి జీతంలో కొంతమొత్తం నిరుద్యోగులకోసం ఖర్చు చేశారన్నారు. 19 సంవత్సరాల ఉద్యోగజీవితాన్ని వదులుకొని, పట్టభద్రులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ బరిలో నిలిచారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య స్వయం శక్తితో ఎదిగి విద్యా సంస్థలను నెలకొల్పారని, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణకు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌కు ప్రాధాన్య ఓటు వేయాలన్నారు.

వెలిచాల రాజేందర్‌ను అభినందించిన సీఎం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. సోమవారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో పట్టభద్రుల సంకల్ప సభలో ముఖ్యమంత్రిని కలిసి తాను రూపొందించిన పట్టభద్రుల మేనిఫెస్టో బుక్‌లెట్‌ను సీఎంకు అందించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావును అభినందిస్తూ ఉపాధి అవకాశాల కోసం రూపొందించిన మేనిఫెస్టో రోడ్ మ్యాప్‌లా ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించేందుకు చేస్తున్న కృషి అభినందించారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. జై మాల మహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నల్లల కనకరాజు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గంటల రేణుక, తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం, జైమాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేందర్, పట్టణ అధ్యక్షుడు రాజేందర్, మాలమహానాడు అధికార ప్రతినిధి సదానందం, ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి కో కన్వీనర్ రొడ్డ శ్రీనివాస్ ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో జిల్లాకు 10వ స్థానం


జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డిని సన్మానిస్తున్న అల్కాలాంబా

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో లక్షమంది సభ్యత్వాలతో దేశంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉండగా కరీంనగర్ జిల్లా పదోస్థానంలో నిలిచింది. సోమవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా మాట్లాడుతూ న్యారీ న్యాయ్ సమ్మేళన్‌లో భాగంగా ఇండియాలో మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు లక్ష చేపట్టి తెలంగాణను మొదటి స్థానంలో నిలపడం అభినందనీయమన్నారు. కరీంనగర్ జిల్లాను దేశంలో 10వ స్థానంలో నిలిపినందుకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డిని సన్మానించారు.

యజ్ఞవరాహ క్షేత్రం వార్షిక అధ్యయనోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని యజ్ఞవరాహక్షేత్రం వార్షిక అధ్యయనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం భద్రాద్రి దేవస్థాన స్థానాచార్యులు స్థలశాయి వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులో పారమిత విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

భగత్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చుక్క లక్ష్మీబాయి రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో పారమిత హెరిటేజ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించారు. పాఠశాల విద్యార్థులు అన్నాడి అశ్రిత్ మూడో ర్యాంకు, పబ్బతి విద్వాన్‌రెడ్డి 6వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ తెలిపారు. చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేష్, వినోద్‌రావు, వీయూఎం ప్రసాద్, టీఎస్‌వీ రమణ, హన్మంతరావు, నాగరాజు, రాము, గైడ్ టీచర్ మహేందర్ పాల్గొన్నారు.

ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారిగా సురేష్ కుమార్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిగా డాక్టర్ సురేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌యూ రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. గోదావరిఖని పీజీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పని చేస్తూ కాన్ఫిడెన్షియల్ విభాగంలో అదనపు కంట్రోలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

డాక్టర్ 'నలిమెల'కు జాతీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ నలిమెల భాస్కర్ దంపతులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రచయిత డాక్టర్ నలిమెల భాస్కర్ సోమవారం ప్రతిష్ఠాత్మక 'సిటీ కాలేజ్ మక్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు' అందుకున్నారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బాల భాస్కర్ అధ్యక్షతన కళాశాల గ్రేట్ హాల్‌లో పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు పురస్కారం అందజేశారు. మన తెలంగాణ దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, రచయిత అన్నవరం దేవేందర్ పాల్గొన్నారు.

రవీందర్‌సింగ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా సర్దార్ రవీందర్‌సింగ్‌ను గెలిపించాలని తెలంగాణ ఎంబీసీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు నరహరి కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 317 జీవో ఉద్యోగులకు శాపంగా మారిందని, వారికి అండగా నిలిచి రద్దు కోసం పోరాడుతానని రవీందర్ సింగ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రైవేటు టీచర్లు శ్రమదోపిడీకి గురి కాకుండా పూర్తి 12 నెలల జీతాన్ని అందించేలా పీఎఫ్ పొందుపరిచేలా కృషి చేస్తారని అన్నారు. రవీందర్‌సింగ్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఆర్టీసీ జోనల్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌గా గిరి సింహారావు

భగత్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):కరీంనగర్ జోనల్ ఆర్టీసీ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌గా ఏవీ గిరి సింహారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆర్ఎం బీరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆసుపత్రిలో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీపై కరీంనగర్‌కు వచ్చారు. డాక్టర్ జయేద వసుధ, డాక్టర్ టి.శివ శుభాకాంక్షలు తెలిపారు.

కరీంనగర్‌కు చేరుకున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆదివారం రాత్రి కరీంనగర్ వేదభవనం చేరుకొని సోమవారం ఆరాధన, తీర్థగోష్ఠి నిర్వహించారు. సాయంత్రం ఎన్‌టీపీసీలో భాగవత సప్తాహ ప్రవచనానికి వెళ్లారు. మార్చి30 నుంచి ఏప్రిల్ 4 వరకు శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో శ్రీమద్రామాయణ ప్రవచనం చేయనున్నారు.

జ్యోతిష్మతిలో ఇన్నోఫెస్ట్-2025


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి గ్రూప్‌ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ వార్షిక ఇంటర్ కాలేజియేట్ టెక్నికల్ ఈవెంట్స్ ఇన్నోఫెస్ట్-2025 కార్యక్రమాన్ని సోమవారం విద్యాసంస్థలచైర్మన్ జువ్వాడి సాగర్ రావు, ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌బివి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఐవోటి, సైబర్ సెక్యూరిటీ వంటి నూతనరంగాల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈనెల24నుంచి 25 రెండురోజులపాటు టెక్నికల్ ఈవెంట్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలసెక్రెటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా ఫ్రెషర్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్, డేటాసైన్స్ లాంటి నూతనకోర్సులపై సమగ్ర విజ్ఞానం కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీరామచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనేవిడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్రకోశాధికారి రాణాప్రతాప్ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవితేజ, అస్లాం, బాబు, రాకేష్, శేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో విద్యుత్ అధికారుల పొలంబాట

గన్నేరువరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో సోమవారం పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు కరీంనగర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నరేందర్, మండల ఏఈ ఆంజనేయులు తెలిపారు. విద్యుత్ సరఫరా, వోల్టేజీ గురించి వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలఎత్తు పెంచనున్నట్లు తెలిపారు. ఎక్కడైతే విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్న వాటిస్థానాలలో 9.1మీటర్ స్థంభాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వినియోగదారులకు అత్యుత్తమసేవలు అందించడానికి కంకణబద్ధులై పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ రామచంద్రరెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.


మైలారంలో రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

యూరియా కోసం రైతుల తిప్పలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. రోజులు గడుస్తున్న కొద్దీ యూరియా కొరత తీవ్రమవుతుందే తప్ప తగ్గడం లేదు. యూరియా సొసైటీలకు వచ్చిందని తెలిస్తే చాలు రైతులు పనులన్నీ వదిలేసి యూరియా కోసం ఎగబడుతున్నారు. సోమవారం నుస్తులాపూర్ సొసైటీకి రాత్రి యూరియాలోడ్ వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి లైన్‌లో నిలబడలేక చెప్పులను పెట్టి నీడకు కూర్చున్నారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉండడంతో ఆలస్యమైతే పంటసరిగా రాదని రైతులు వాపోతున్నారు. అధికారులు సరిపడా యూరియా నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సభకు తరలివెళ్లిన పట్టభద్రులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నుంచి కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో జరిగిన సంకల్పసభకుపట్టభద్రులుభారీగా తరలివెళ్లారు.

గంగాధర: గంగాధరకు ఐదుబస్సులను కేటాయించగా వివిధ గ్రామాల నుంచి పట్టభద్రులు సీఎం సభకు తరలివెళ్లారు.

విద్యార్థుల ఎఫ్ఏ మార్కుల పరిశీలన

సైదాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్, సోమారం మోడల్ స్కూల్‌లోని పదోతరగతి విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ)మార్కులను జిల్లామానిటరింగ్ బృందం సోమవారం పరిశీలించింది. చిగురుమామిడి మండల విద్యాధికారి పావని, రామంచ హెచ్ఎం దామోదర్, సుందరగిరి ఉపాధ్యాయుడు ఎండీ సలీం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వెన్నంపల్లి హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌సింగ్, ప్రవీణ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దమోరి నుంచి బతుకమ్మ సొర్లకు వెళ్లే రహదారిని ధ్వంసంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు కాలనీవాసులు సదానందం, శ్రీనివాస్, రవీందర్‌రావు, సంజీవ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. పెద్దమోరి నుంచి బతుకమ్మ సొర్లకు వెళ్లేందుకు వందేళ్లుగా రహదారి ఉందన్నారు. కొంత కాలంగా గుర్తుతెలియని వ్యక్తులు ప్రధానరహదారి వద్ద రోడ్డును తవ్వి నిరూపయోగంగా మారుస్తున్నారన్నారు. వెంటనే రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, దారిని పునరుద్ధరించాలని కోరారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు, నుస్తులాపూర్ సర్పంచ్ రావులరమేష్ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్‌లో ఎన్‌పీఎల్‌క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుతోపాటుక్రీడల్లో రాణించాలన్నారు. విద్యా ర్థులు, యువకులు తమకు ఎందులో ఆసక్తిఉందో గుర్తించి అందులో రాణించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్‌సభ్యుడు వంగల శ్రీనివాస్‌రెడ్డి, నూనెరమేష్, సంపత్‌పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండ నరేందర్ రెడ్డి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డి గెలిస్తే నిరుద్యోగ పట్టభద్రులకు అండగా ఉంటారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం అల్గునూరులోని ఎస్‌వి గార్డెన్స్‌లో పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27న జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలి

సైదాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. సమావేశంలో మండల జేఏసీ నాయకుడు జంపయ్య, డ్యాగల సారయ్య, బత్తులబాబు, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్‌లో నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్‌యాదవ్, తదితరులున్నారు.

పోటాపోటీ ప్రచారం

మానకొండూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ, ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం ఆయా పార్టీల నాయకులు పోటాపోటీ ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు.

చొప్పదండి: బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని గెలిపించాలని చొప్పదండిలో బీజేపీ జిల్లాకార్యదర్శి చేపూరి సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారాన్ని నిర్వహించారు. పలు వార్డుల్లో పట్టభద్రులను కలిసిఓటును అభ్యర్థించారు.

శివరాత్రి పండుగపై ప్రచారం

హుజూరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని అర్కండ్ల గ్రామంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక హుజూరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి పండుగపై సోమవారం ప్రచారం నిర్వహించారు. శివరాత్రి పండుగ విశిష్టతపై గ్రామస్థులకు వివరించారు.

బస్టాండ్‌ను పరిశీలించిన డీఎం

శంకరపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌ను హుజూరాబాద్ డిపోమేనేజర్ రవీంద్రనాథ్ సోమవారం సందర్శించారు. రహదారి నిబంధనలను పాటించి బస్సులు నడపాలని ఆర్టీసీ డ్రైవర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వీణవంక, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి తీర్థల సునీత శ్రీనివాస్, మీసా లతసాగర్ మీసా రాజయ్య జ్ఞాపకార్థం రూ.1,00,116ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ

గంగాధర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుభూత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ పమేలాసత్పతి పంపిన బుక్స్, పెన్సిల్స్, నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ పంపిణీ చేశారు. ఇటీవల ఇటుకబట్టీల పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యనందిస్తున్నారు.